# కథ

**-ఆకునూరి మురళీకృష్ణ**

**ఐమాక్స్ థియేటర్ల కాలంలో యువకుడికి పల్లెటూర్లో టూరింగ్ టాకీస్‌లో సినిమా చూడడం అభిరుచైతే ఎలా ఉంటుంది? అదీ పాతకాలం నాటి బ్లాక్ అండ్ వైట్ సినిమాలు?**

**పిజ్జాలు, బర్గర్ల రోజుల్లో రేగిపళ్లు, మొక్కజొన్న పొత్తులూ, తేగలూ తినడం ప్రాణమైతే ఎలా ఉంటుంది?**

**రామూ శ్యామూ లాంటి పేర్లే పాతబడిపోతున్న రోజుల్లో రేలంగి అంటూ ఇంటిపేరుతో పిలిపించుకోవడం ఇష్టమైతే ఎలా ఉంటుంది?**

## పెళ్లి కుదిరింది

చూసే వాళ్లకి వినే వాళ్లకీ ఎలా ఉంటుందన్నది వేరే సంగతి కానీ ప్రస్తుతం రాజ్యలక్ష్మికి మాత్రం ఒళ్లు మండిపోతోంది. ఇలాంటి అభిరుచులన్నీ కలిగిన సదరు రేలంగి కామేశ్వరరావుకి స్వయానా తోడబుట్టిన అక్క రాజ్యలక్ష్మి.

నీతో పెళ్లిచూపులకి రావడం ఇంక నావల్ల కాదురా. ఆ పెళ్లిచూపుల్లో అమ్మాయిలని నువ్వడిగే ప్రశ్నలు విని నువ్వీకాలంలో పుట్టాల్సిన మనిషివేనా అనుకుంటూ నిన్నూ నీతో పాటూ మమ్మల్నీ వింత మనుషుల్ని చూసినట్లు చూస్తున్నారు'' కరాఖండీగా చెప్పేసింది ఆమె కామేశ్వర్రావుతో.

''నువ్వే అలాగనేస్తే ఎలా అక్కా?'' బేలగా అన్నాడు కామేశ్వర్రావు.

''పోనీ వినడానికి మీకంత ఇబ్బందిగా ఉంటే ఈసారి ఎవరూ వినకుండా ప్రశ్నలడుగుతానులే అమ్మాయిని'' అన్నాడు అమాయకంగా.

రాజ్యలక్ష్మి కామేశ్వర్రావుని మింగేసేలా చూసి అంది. ''అంతేకానీ నీ బలహీనతలని వదులుకోనంటావు?''

''అవి బలహీనతలు కావే... ఇష్టాలు!'' కోపంగా అన్నాడు.

''రెండింటికీ పెద్ద తేడా లేదులే... ఇష్టం ముదిరితే బలహీనమవుతుంది. అయినా నీకివేం ఇష్టాలురా'' తలపట్టుకుంటూ అంది.

''అవునులే... అమ్మ నాతో పాటూ నిన్నూ అమ్మమ్మ దగ్గర ఆత్రేయపురంలో పెంచి ఉంటే తెలిసుండేది... దోరగా కాల్చిన లేత మొక్కజొన్నపొత్తుల మీద నిమ్మకాయ రాసుకుని తింటే ఎంత రుచిగా ఉంటుందో, మిగలముగ్గిన రేగిపళ్లని ఉప్పూ కారం పచ్చిమిరపకాయలతో కలిపి దంచి ఎండబెట్టిన వడియాలు తింటే ఎంత మజాగా ఉంటుందో... అమ్మమ్మ నాకు రోజూ స్కూలు నుంచి రాగానే తినడానికి అవే పెట్టేది.'' ఏదో లోకాల్లోకి వెళ్లిపోతున్నట్లుగా అన్నాడు.

''సరేలేరా.. కానీ నువ్విప్పుడుంటున్నది ఆత్రేయపురంలో కాదు.. హైదరాబాద్‌లో. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నావు'' అంది.

''ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తుంటే రేగిపళ్లు, తేగలూ, ముంజుకాయలూ లాంటివి తినకూడదని ఎక్కడా రూలు లేదే? మా కంపెనీ సర్వీస్ కండిషన్లలో కూడా ఎక్కడా చూసినట్లు లేదు'' మళ్లీ అమాయకంగా ముఖం పెట్టి అన్నాడు కామేశ్వర్రావు.

''చంపుతాను. నువ్వు అఘోరిస్తే అఘోరించావు కానీ నీ కాబోయే పెళ్లాం కూడా నీలాగే ఉండాలనుకోవడం తప్పు. అలాగనుకుంటే నీకీ జన్మకి పెళ్లికాదు. ఇన్నాళ్లూ నీ రుచులతోనూ అభిరుచులతోనూ నిన్ను మేపలేక చచ్చాను. మీ బావగారు కూడా విసుక్కుంటున్నారు. కొన్నాళ్లు ఆగితే నీతో పెళ్లి కాకుండానే వేరే కాపురం పెట్టించాల్సి వస్తుంది జాగ్రత్త'' అంటూ అరగంట క్లాస్ పీకింది.

ఆమె చెప్పినదానికి ఇష్టం లేకపోయినా బుద్ధిగా తలాడించాడు కామేశ్వర్రావు. ఏం చేస్తాడు... పెళ్లి కోసం వయసు తొందరపెడుతోంది. ఈసారైనా తన 'టేస్ట్'కి తగిన అమ్మాయి దొరికితే బాగుండుననుకున్నాడు.

''ఈ అమ్మాయికైనా మా వాడు నచ్చితే బాగుండును. జూనియర్ ఆర్టిస్ట్‌లా నాకు ప్రతీ సారీ ఈ పెళ్లిచూపుల సీన్‌లో పాల్గొనే బాధ తప్పుతుంది'' మనసులోనే దేవుడికి నమస్కరిస్తూ అనుకున్నాడు కామేశ్వర్రావు బావ సురేష్ పెళ్లిచూపులకి బయలుదేరుతూ.

''అయాం రేలంగి కామేశ్వర్రావు'' అంటూ పరిచయం చేసుకుంటున్న కామేశ్వర్రావుని వింతగా చూసింది పెళ్లికూతురు.

''నీ ముఖంలా ఉంది. అదేం పరిచయం చేసుకోవడంరా? స్టైల్‌గా అయాం కామేష్ అనలేవూ? గుడ్లురిమి చూస్తున్న అక్క ముఖంలోకి భావాలని ఇట్టే చదివేయగలిగాడు కామేశ్వర్రావు.

అయినా ఏమీ అర్థం కానట్లుగా తల తిప్పేస్తున్నాడు. చిన్నప్పుడు స్కూల్లో తమ తెలుగు మాస్టారు అందరినీ ఇంటిపేర్లతోనే పిలిచేవారు. దాంతో స్నేహితులంతా కూడా ఒకరినొకరు ఇంటిపేరుతోనే పిలుచుకునేవారు. తనకి కొందరు స్నేహితుల ఇంటి పేర్లే తప్ప అసలు పేర్లు తెలియవు. ఆనాటి ఆ పిలుపులు ఎంత మధురంగా గుర్తుండిపోయి తనిప్పటికీ ఇంటిపేరుతోనే పిలిపించుకోవడానికే ఇష్టపడతాడు.

'తను ఇంటిపేరుతో పాటూ అసలు పేరు కూడా జతచేసి చెప్పాడుగా? అయినా కోపం ఎందుకో' ఓరకంట రాజ్యలక్ష్మిని చూస్తూ అనుకున్నాడు.

ఎప్పటిలాగానే పెళ్లికూతురు విపరీతంగా నచ్చేసింది కామేశ్వర్రావుకి.

పరిచయాలూ ఫలహారాలూ అయ్యాక ''అమ్మాయితో నేను పర్సనల్‌గా మాట్లాడాలండీ'' అన్నాడు అక్క బావల ముఖాలకేసి చూడకుండా. చూసి ఉంటే, అతడి వంక వాళ్లు చూసిన చూపులకి మాడి మసైపోయేవాడే.

''దానిదేముంది? ఈ రోజుల్లో ఇదంతా మామూలే కదా?'' అన్నారు ఆడ పెళ్లివారు వాళ్ల చూపుల్ని మరోలా అర్థం చేసుకుంటూ.

అతనితో పర్సనల్‌గా మాట్లాడడానికి వేరే గదిలోకి వెళ్తున్న పెళ్లికూతుర్ని పులిబోనులోకి అడుగుపెడుతున్న జింక పిల్లని చూసినట్లు జాలిగా చూశారు. నరేష్, రాజ్యలక్ష్మిలు.

''మీరు గుండమ్మ కథ సినిమా చూశారా?'' ఉత్సాహంగా అడిగాడు కామేశ్వర్రావు అందులోని జమునలా ఉన్న ఆ అమ్మాయిని ఆరాధనగా చూస్తూ.

''గుండమ్మ కథా?'' ముఖం చిట్లించి


అందా అమ్మాయి అచ్చం జమునలాగానే.

కామేశ్వర్రావు ఆమెకి గుండమ్మ కథ సినిమా గురించీ అందులోని నటీనటుల నటన గురించీ, పాటల గురించీ ఓపిగ్గా వివరించి చెప్పేడు.

ఆమె విసుగ్గానే వింది. చివరికి తేలిందేమిటంటే, ఆమెకి జూనియర్ ఎన్టీఆర్ తప్ప మరే ఎన్టీఆర్ తెలియదు. సిమ్రాన్‌ని తప్ప సావిత్రిని గుర్తుపట్టలేదు. మైకేల్ జాక్సన్ గురించి తప్ప మంగళంపల్లి బాలమురళీకృష్ణ గురించి వినలేదు.

ఆఖరికి రుచుల్లోనూ తామిద్దరి అభిరుచులూ కలవవని అర్థవైపో యింది.

వెళ్లొస్తా



మని చెప్పినప్పుడు ఆ అమ్మాయి చూసిన చూపులకి లోపలేం జరిగిందో రాజ్యలక్ష్మికి కూడా బాగా అర్థమైపోయింది.

''ఛీ... నీకింక ఈ జన్మకి పెళ్లికాదురా!'' ఆటో ఎక్కుతూ కోపంగా అందామె తమ్ముడితో.

★ ★ ★

కామేశ్వర్రావుకి బాధగా ఉంది. చిన్నతనంలో తను పెరిగిన వాతావరణం, అమ్మమ్మ తాతయ్యల ప్రభావం తన మీద చాలా ఉంది. దాని ప్రకారమే తన ఇష్టాయిష్టాలు ఏర్పడ్డాయి. వాటిని అంత తేలికగా వదులుకోలేకపోతున్నాడు.

అయినా తన అభిరుచికి తగిన అమ్మాయి దొరకడం అంతకష్టమా అని ఆశ్చర్యంగా ఉందతనికి.

నిరాశతో కృంగిపోయి 'అంతా భ్రాంతియేనా' అ న ం కుంటూ బ్లాక్ అండ్ వైట్‌లో పాడుకుంటూ తిరుగుతున్న రోజుల్లో అతని జీవితం ఒక రోజు అనుకోని మలుపు తిరిగింది.

'సంగీత్ సాగర్'లో పాత సినిమా సీడీలున్న షోకేస్ దగ్గిర తచ్చాడుతున్న కామేశ్వర్రావుకి కళ్ల ముందొక మెరుపు తీగ మెరిసినట్లయింది.

అందమైన అమ్మాయి... లేతనీలం రంగు చుడీదార్‌లో గంధర్వకన్యలా ఉంది. ఒక్క క్షణం తనని తాను మరిచిపోయి ఆమెనే చూస్తూండిపోయాడు.

ఆమె అందం చూసి సగం దాసోహమైపోయిన అతను నోరువిప్పి ఆమె మాట్లాడిన మొదటి మాట వినగానే ఇంకేం ఆలస్యం చేయకుండా ఆమే తనకి కాబోయే జీవితభాగస్వామి అని తీర్మానించేసుకున్నాడు. 'లవ్ ఎట్ ఫస్ట్ టాక్' అన్నమాట!

ఇంతకీ ఆమె మాట్లాడింది కామేశ్వర్రావుతోననుకుంటే పొరపాటు పడినట్లే. ఆమె మాట్లాడినది కామేశ్వర్రావుతో కాదు... సీడీల షాపు సేల్స్‌మేన్‌తో.

'చిత్తూరు నాగ య ్యగా రి తా ్యగ య ్య ఉందాండీ?'' అందామె. ఆ మాటలకి పడిపోయాడు కామేశ్వర్రావు.

చిన్న పిల్లాడు ఐస్‌క్రీం బండి వెంట పరిగెట్టినట్లు ఆ షోరూమ్‌లో ఆమె ఎటువెళితే అటూ ఆమె వెనకాలే పిచ్చిగా తిరిగాడు.

షాపంతా వెతికి చివరకి ఆమె అడిగిన సినిమా లేదని తేల్చాడు సేల్స్‌మేన్.

''అయ్యో'' అందామె నిరాశగా.

అప్పటికే ఆమెని తన ప్రేయసిగా ఫిక్సయిపోయిన కామేశ్వర్రావు ఆమె ముఖంలో నిరాశని చూడలేకపోయాడు.

''పోనీ బాపూగారు తీసిన త్యాగయ్య ఉంది తీసుకెళ్లండి'' అన్నాడు తనే వెదికి పట్టుకుని.

ఆమె అతని వంక కళ్ళు విప్పార్చుకుని ఆశ్చర్యంగా చూసి. ''థాంక్సండీ'' అంది.

కామేశ్వర్రావు మెలికలు తిరిగిపోయాడు. షాపులోంచి ఇద్దరూ కలిసి బయటికి వచ్చేరు. పక్కన తన అక్క లేకపోవడంతో ఆమెకి తనని నిర్భయంగా రేలంగి కామేశ్వర్రావుగా పరిచయం చేసుకున్నాడు.

ఆమె పేరు రేఖట. ''రేఖా... నా అదృష్ట రేఖా'' ఆనందంగా అనుకున్నాడు కామేశ్వర్రావు.

ఆమె అడ్రస్, ఫోన్ నెంబరూ అడుగుదామనుకుని మొదటిరోజే అడ్వాన్సయితే మొదటికే మోసం రావచ్చని ఊరుకున్నాడు.

రేఖని చూడడంతో తన అభిరుచులకి తగ్గ అమ్మాయిలు కూడా ఉంటారన్న విషయం అర్థమై కామేశ్వర్రావుకి కొంచెం ధైర్యం వచ్చినట్లయింది.

అతని మనోబలాన్ని మరింత పెంచుతూ ఆమె మళ్ళీ రెండు మూడుసార్లు కనిపించిందతనికి... ఒకసారి టాంక్ బండ్ మీద మొక్కజొన్నపొత్తులు బేరమాడుతూ, మరోసారి రైతుబజార్లో రేగిపళ్ళు కొంటూ!

ఆశ్చర్యంతో నోరు తెరుచుకునుండిపోయాడు కామేశ్వర్రావు ఆమెనలా చూసి. ఆ తర్వాత కళ్ళు మూసినా తెరిచినా ఆమే కనబడసాగింది అతనికి.

అదృష్టం తనింటి తలుపు తడుతున్నట్లనిపించింది.

అదృష్టం పెరటితలుపులు, కిటికీ తలుపులూ కూడా తట్టడమంటే ఏమిటో... మర్నాడు మేరేజ్ బ్రోకర్ తెచ్చిన పెళ్ళికూతుళ్ల ఫోటోల్లో తన ప్రేయసి రేఖ ఫోటో కూడా

## బిపాషా ధీమా!

**బిపాషా బసు తన 17వ ఏట నుంచే ధనార్జన ప్రారంభించిందిట. మోడలింగ్, ఆ తర్వాత సినిమాల ద్వారా ఆర్థికంగా తను ఎవరికీ భారం కాకుండా నిలబడగలిగానని గర్వంగా చెబుతుంది బిపాషా. తన చెల్లెలికి కూడా తరుచూ ఈ ఆర్థిక స్వేచ్ఛ గురించి హితబోధ చేస్తుంటుందిట. 'నేను ఈరోజున ఎవరి మీదా ఆధారపడాల్సిన స్థితిలో లేను. నా బతుకు నేను ఎంతో హాయిగా బతుకుతున్నాను. ఆర్థికంగా నా పొజిషన్‌ని నా స్వయంకృషితోనే నిలబెట్టుకున్నాను అని గర్వంగా చెప్పగలను' అంటుంది బిపాషా ఎంతో ధీమాగా.**



ఉండడం చూశాక అర్థమైంది కామేశ్వర్రావుకి.

''నాకే ఒక్క అవకాశం ఇవ్వండి.... ఈసారి అక్కడ పెదవి విప్పను గాక విప్పను. కావాలంటే నా నోటికి ప్లాస్టర్ వేసి తీసుకు వెళ్లండి'' అక్కనీ బావనీ బతిమాలుతూ అన్నాడు కామేశ్వర్రావు.

''అంత ఖచ్చితంగా ఎలా మాటివ్వగలవు?'' అనుమానంగా అడిగారు.

''ఎందుకంటే... ఆ అమ్మాయి టేస్టూ, నా టేస్టూ ఒకటేనని నాకు ముందే తెలుసు కనుక'' సిగ్గుపడుతూ చెప్పాడు కామేశ్వర్రావు.

వాళ్లిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

★ ★ ★

అన్నమాట ప్రకారం కామేశ్వర్రావు నోరు విప్పక పోవడంతో వాళ్ల పెళ్లిచూపుల్లోనూ పెళ్లిలోనూ విఘ్నేశ్వరుడికి పూజలందుకోవడం తప్ప పెద్ద పనిపడలేదు.

శోభనం రోజు రాత్రి...

పక్కన పళ్లెంలో పెట్టిన తినుబండారాలు, పళ్లు చూస్తూ అన్నాడు కామేశ్వర్రావు ''ఇక్కడ రేగి వడియాలు పెట్టలేదేం?''

రేఖ ముఖం చిట్లించి అంది. ''రేగి వడియాలా? రేగిపళ్లతో వడియాలు కూడా చేస్తారా? అయినా ఇన్ని పళ్లుండగా రేగిపళ్లే కావాల్సి వచ్చాయా మీకు? అవేం బావుంటాయి... పుల్లగా...'' అంది ముఖం చిట్లించి.

మామూలుగా అయితే ఆ మాటలకి తల తిరిగి ఉండేది కామేశ్వర్రావుకి. కానీ అప్పటికే ఆమె మీద పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయి ఉండడం చేతా, శోభనం పెళ్లికూతురి అలంకరణలో ఉన్న ఆమె అందం చూసి మతిపోయినవాడై ఉండడం చేతా ఆమె మాటలని వినిపించుకోకుండా ఆత్రంగా ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

★ ★ ★

నాలుగు రోజులు గడిచేసరికి కామేశ్వర్రావుకి అర్థమైపోయింది. ఆమెకి తనకున్న ప్రత్యేకమైన అభిరుచులేమీ లేవని. తను చూస్తున్నప్పుడు ఆమె కొన్నవేవీ తన కోసం కొనుక్కున్నవి కావు! తనే తొందరపడి పెళ్లిలో కాలేసేశాడు.!

అతను చెప్పిందంతా విన్నాక విచారంగా అంది రేఖ ''బాధ పడకండి... కనీసం ఈ విషయం నాకు మన పెళ్లికి ముందే తెలిసినా మీరు కోరుకున్నట్లుగానే అచ్చం మీలాంటి అభిరుచులున్న ఆవిడ్ని పరిచయం చేసుండేదాన్ని మీకు.''

కామేశ్వర్రావు ఉలిక్కిపడి ''నా లాంటి అభిరుచులున్న వ్యక్తా? ఎవరావిడ?'' అన్నాడు.

''మా బామ్మ!! మీరు చూస్తున్నప్పుడు నేను కొన్నవన్నీ ఆవిడ కోసమే కదా!'' అంటూ కిలకిలా నవ్వింది రేఖ.

ఇష్టం ముదిరితే బలహీనమవుతోందో లేక బలహీనత ముదిరితే ఇష్టమవుతుందో తెలీదు కానీ, ఆ తర్వాత కామేశ్వర్రావు ఇష్టాల జాబితాలోకి రేఖ కూడా చేరడానికి ఎంతో కాలం పట్టలేదు!

☆